ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024



ఇంకొక్కటి అడిగి.. దొరికారు..!



1.డీఆర్ఎం వినీత్ సింగ్ 2. సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ అక్కిరెడ్డి 3. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబు

ఎప్పుడూ ఒకశాతం తీసుకునేవారు.. ఈసారి రెండు శాతం కావాలన్నారట..

సీబీఐ వలలో పడ్డ అవినీతి చేపల కథ ఇది..

డీఆర్ఎం సహా ఐదురుగు రైల్వే అధికారుల అరెస్టు

లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లపైనా కేసు

గుంతకల్లు, జూలై 6: ఎప్పుడూ ఒక శాతం కమీషన్(లంచం) తీసుకునేవారట..! కానీ ఈసారి ఇంకొక్క శాతం ఎక్కువ కావాలని అడిగారట. ఆ దురాశే వారిని ఊచలు లెక్కబెట్టేలా చేసింది. సీబీఐ వలలో చిక్కి.. పరువు బజారున పడేలా చేసింది. గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రంలో తొలిసారి సీబీఐ దాడులు జరగడానికి కారణం ఇదే అంటున్నారు. డీఆర్ఎం కార్యాలయంలో ఓ శాఖాధికారిపై కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదు అవినీతి వృక్షాలను పెకిలించింది. రైల్వే అకౌంట్స్ విభాగంలో అవినీతి బురద డీఆర్ఎం కార్యాలయానికి మాసిపోని మరకలను అంటించింది. తిరుపతిలో ఆరు నెలల కిందట జరిగిన సీబీఐ దాడులు మరువకనే.. అంతకు మించిన అవినీతిని బయట పెట్టేదాడులు గుంతకల్లులో జరిగాయి. డీఆర్ఎం వినీత్ సింగ్, బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డి, సీనియర్ డీఎఫ్ఎం కె.ప్రదీప్ బాబు, అకౌంట్సు విభాగం సూపరింటెండెంటు బాలాజీ, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజరు కార్యాలయ అకౌంట్సు అసిస్టెంటు డి.లక్ష్మీపతిరాజును సీబీఐ అరెస్టు చేసింది. వారిని కర్నూలు సీబీఐ కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరితోపాటు లంచం ఇచ్చినందుకు ఇద్దరు కాంట్రాక్టర్లనూ సీబీఐ మూసేసింది. అందరూ కర్నూలు జిల్లా జైలుకు శనివారం రాత్రికి చేరుకున్నారు. సీబీఐ దాడులు రైల్వే డివిజన్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తామెక్కడ దొరికిపోతామోనని అక్రమార్కులు హడలిపోతున్నారు. మూడు రోజులుగా డీఆర్ఎం కార్యాలయంలో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడిపారు.



కర్నూలు కోర్టు ఆవరణలో నిందితులు, సీబీఐ అధికారులు



ముఖం చూపించలేక..

ఇలా మొదలైంది..

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేంద్రం ప్రభుత్వం నుంచి గతిశక్తి ప్రాజెక్టు కింద భారీగా నిధులు విడుదలయ్యాయి. సేఫ్టీ కేటగిరిలో వచ్చిన ఈ నిధులతో వంతెనలను నిర్మించాల్సి ఉంది. పీలేరుకు చెందిన సత్యనారాయణ అనే ప్రధాన కాంట్రాక్టరుకు రూ.50 కోట్ల విలువైన బ్రిడ్జి వర్కులు దక్కాయి. ఆయన వంతెన పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చారు. పనులను ప్రాంభించడానికిగానూ అక్సెప్టెన్సీ లెటరు కోసం సబ్ కాంట్రాక్టర్లు రమేశ్ రెడ్డి, రహ్మతుల్లా అకౌంట్సు కార్యాలయం చుట్టూతిరిగారు. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు కొత మొత్తం లంచంగా ఇచ్చారు. అయినా పనిచేయకుండా.. పెద్ద మొత్తంలో డిమాండు చేశారు. దీంతో సబ్ కాంట్రాక్టర్లు సీబీఐ అధికారులను ఆశ్రయించారు. దీంతో సీబీఐ అధికారులు గుంతకల్లుకు వచ్చి.. నిఘా వేశారు. సీబీఐ డీఎస్పీ జైకుమార్ భారతీయ, ఆయన సిబ్బంది అవినీతి అధికారిని పట్టుకోవడానికి పథకం రచించారు. పథకం ప్రకారం సబ్ కాంట్రాక్టర్లు ఇచ్చిన రూ.11 లక్షల లంచం డబ్బులను అకౌంట్సు సిబ్బంది తీసుకున్నారు. సీబీఐ అధికారులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబును పట్టుకున్నారు. ఆ తరువాత వీడియో కాన్ఫరెన్సులో ఉన్న డీఆర్ఎం వినీత్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం ఇళ్లల్లో సోదా చేశారు. భారీగా బంగారు ఆభరణాలు, డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) యు.అక్కిరెడ్డికి కూడా ఈ అవినీతిలో భాగం ఉందని నిర్ధారించుకుని, అతడిని సికింద్రాబాదు నుంచి రప్పించి అరెస్టు చేశారు. వారిపై అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం 61(2)-బీఎన్ఎస్, 7, 8, 9, 10, 12 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. గతంలో లంచం ఇచ్చిన ఇద్దరు సబ్ కాంట్రాక్టర్లపై కూడా కేసులు పెట్టారు. వీరందరికీ గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం వైద్య పరీక్షలను నిర్వహించి, కర్నూలులోని సీబీఐ కోర్టు ఎదుట హాజరుపరిచారు.

వైసీపీ భక్తులు..

నెల కిందటి వరకూ గుంతకల్లు డివిజనల్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) హోదాలో పనిచేసిన అక్కిరెడ్డికి, సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్ బాబుకు వైసీపీ అంటే వల్లమాలిన అభిమానం. ఈ అవ్యాజమైన ప్రేమతో పలువురు కాంట్రాక్టర్లకు దక్కాల్సిన పనులను వైసీపీ అనుకూలురైన కాంట్రాక్టర్లకు వచ్చేలా ఉడత సాయాలు చేసినట్లు సమాచారం. అధికారులమన్న ధ్యాస లేకుండా ఆ పార్టీకి కొమ్ముకాశారన్న ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల సమయంలోనే కాంట్రాక్టర్లు పోటీపడకుండా అడ్డుపడి, అస్మదీయులకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డివిజన్‌లోని పలువురు కాంట్రాక్టర్లకు వారి వ్యవహారం కంటగింపుగా మారినట్లు సమాచారం. ఆ అసంతృప్తే కాంట్రాక్టర్లలో ఇలా బైటపడిందని డీఆర్ఎం కార్యాలయంలో చెప్పుకుంటున్నారు. గుంతకల్లులోని ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ వంతెన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి మార్చిలో హాజరై.. స్టేజీ ఎక్కి మరీ వైసీపీ భజన చేశారు. వీరిలో ఒకరు ఎన్నికల తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆ కార్యక్రమానికి హాజరు కావడానికి పాసు కూడా తెప్పించుకున్నట్లు తెలిసింది.

రెండు శాతం డిమాండుతో..

కేంద్ర ప్రభుత్వం రైల్వే పనులకు సంబంధించి ఏ డివిజన్‌కు ఆ డివిజన్‌లో టెండర్లను నిర్వహించనీయకుండా, పలు వర్కులను కలిపి ఒకే పెద్ద వర్కుగా మార్చి అంబ్రెల్లా వర్కుల పేరిట బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు.. స్థానిక అధికారులకు ఒక శాతానికి మించకుండా మామూళ్లు ఇస్తుంటారు. కానీ కడప వద్ద సబ్ కాంట్రాక్టర్లు చేసేందుకు సిద్ధపడిన వంతెనల వర్కులపై 2 శాతం మమూలు ఇవ్వాలని డిమాండు చేశారని సమాచారం. అందుకే వ్యవహారం తెగేదాకా వచ్చిందని అంటున్నారు. రైల్వే డివిజన్‌లోని తిరుపతిలో ఫిబ్రవరిలో ఇద్దరు ఉద్యోగులు సీబీఐ చేతికి చిక్కారు. ఎలెక్ట్రికల్ ఎస్ఎస్ఈగా పనిచేస్తున్న గంటా రామమోహన రావు, ఏడీఈఈగా పనిచేస్తున్న అప్పలరాజు.. మెసర్స్ కోర్ ఫోర్ ఇంజనీరింగ్ కంపెనీ నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తిరుపతిలోని కోచ్ వాషింగ్ అండ్ సిక్ మెయింటెనెన్స్ డిపోలో బోగీలకు 750 ఓల్టు విద్యుత్తు సరఫరా కాంట్రాక్టు విషయంగా లంచం తీసుకుంటూ వారు దొరికారు. అది జరిగి ఆరు నెలలు తిరక్కుండానే డివిజనల్ హెడ్ క్వార్టర్లులోనే అవినీతి చేపలు సీబీఐ చేతికి చిక్కాయి.



కర్నూలు సీబీఐ కోర్టులోకి నిందితులను తీసుకెళుతున్న అధికారులు

పెళ్లంటె కన్నీళ్లు.. కష్టాలు..!

ఎదురు కట్నమిచ్చినా దొరకని వధువు

పెళ్లి కోసం రాష్ట్రాలు దాటుతున్న రైతు బిడ్డలు



పల్లెటూరి పిల్లోడికి పెండ్లి సంబంధం అంటే.. పెళ్లికూతురు తరపు నుంచి బంధువులు చాలామందే వచ్చేవారు. 'సేద్యంలో మొనగాడేనా..?' అని ఊళ్లో వాళ్లని ఆరాతీసేవారు. పొలం ఏమాత్రం ఉంది..? దొడ్లో గడ్డి వాములు ఎన్నున్నాయి..? ఎన్నిగాండ్ల ఎద్దులున్నాయి..? దిబ్బలో ఎన్ని బండ్ల ఎరువు ఉంది..? కొట్టిడీలో తిండిగింజలు ఏ మాత్రం ఉన్నాయి..? అని గమనించేవారు. ఇవి ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎగేసుకుని పిల్లనిచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఆలోచనా మారింది. 'సేద్యగాడికి ఇచ్చి మా పాపను కష్టపెడతామా..?' అని ఆడపిల్ల తల్లిదండ్రులు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా.. యువరైతులు పెళ్లి కాకుండానే నడి వయస్కులు అవుతున్నారు. మరికొందరు కర్ణాటక, తెలంగాణలోని దూర ప్రాంతాలకు వెళ్లి.. ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకొచ్చుకుంటున్నారు. ఒకప్పుడు కట్నకానుకలు పోసి అల్లుడిని కొనలేక ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఎదురు కట్నం ఇస్తామన్నా కోడలు దొరకడం లేదు. వ్యవసాయ సంక్షోభం కారణంగా తలెత్తిన సామాజిక సంక్షోభం ఇది అని విశ్లేషకులు అంటున్నారు. ఈ రెంటికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే..!

(పూర్తి వివరాలు 7లో)

రుణ లక్ష్యాలపై నిర్లక్ష్యం వద్దు

బ్యాంకర్లకు కలెక్టర్ వినోద్ కుమార్ సూచన

జిల్లా వార్షిక ప్రణాళిక రూ.18,992.35 కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జులై 6: నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వీడాలని, నెలరోజుల్లో తప్పనిసరిగా లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంకర్లకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. డీపీఆర్‌సీ భవనంలో శనివారం జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. రైతులు, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు ఉపాధి కల్పించాలని సూచించారు. సోషల్ మీడియా, ఇతర ప్రసారమాధ్యమాలు, పత్రికల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలని, అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. డిక్కీ, స్టాండప్ ఇండియా, విద్యా రుణాలు, వ్యవసాయ సదుపాయాలు, స్వనిధి, రివర్స్ రుణాలు, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పీఎంఈజీపీ, విశ్వకర్మ, హార్టికల్చర్ కింద ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు, ఇతర పథకాల కింద రుణాలు మంజూరు చేయాలని సూచించారు. సంవత్సరానికి సరిపడే షెడ్యూల్ ముందుగానే తయారు చేయాలని, ప్రణాళికను సిద్ధం చేయాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18,992.35 కోట్లు వార్షిక రుణప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇందులో వ్యవసాయ రుణాలు రూ.12,984 కోట్లు, ఎంఎస్ఎంఈ రుణాలు రూ.2,513 కోట్లు, ప్రాధాన్యతా రంగాలకు రూ.2,708 కోట్లు, మిగిలిన రంగాలకు రూ.787 కోట్లు రుణాల లక్ష్యాన్ని నిర్దేశించారు. సమీక్షలో ఎల్‌డీఎం నర్సింగ్‌రావు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, జిల్లా లీడ్ అధికారి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగపూర్ చీనీ అంట్లు వాడండి

● శాస్త్రవేత్తల బృందం సూచన ● జిల్లా చీనీ తోటల్లో తెగుళ్లపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తల బృందం సభ్యుడు రాజేశ్వర్ సింగ్

అనంతపురం అర్బన్, జూలై 6: రంగపూర్ చీనీ అంట్లు వాడితే చాలా ప్రయోజనకరంగా ఉంటుందని పలు రాష్ట్రాలకు చెందిన శాస్త్ర వేత్తల బృందం సూచించింది. స్థానిక డ్వామా సమావేశపు హాల్‌లో శని వారం ఉద్యాన పరిశోధన స్థానం రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యంతో కలిసి పలు రాష్ట్రాల శాస్త్రవేత్తలు చీనీ పంట సాగు, సోకుతు న్న తెగుళ్లు, నివారణ చర్యలు తదితర అంశాలపై ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులతో ఆరా తీశారు. జిల్లాలో సాగు చేస్తున్న చీనీ తోటలకు ఎండుకొమ్మ తెగులు, వేరు కుళ్లు, పులుసు పురుగులు, బంక కారడం, కాండం కుళ్లు, పండు ఈగ సోకడంతో వంటి వ్యాధులు వస్తున్నట్లు వారికి ఉద్యాన అధికారులు వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో చెట్ల వేర్లకు సరిగా నీరు అందడం లేదని వారికి వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం సభ్యులు రాజేశ్వర్ సింగ్, వాస్కాసింగ్‌లు మాట్లాడుతూ... నర్సరీల్లో సర్టిఫైడ్ చీనీ మొక్కలు కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చీనీ తోటల సాగులో రైతుల సందేహాలు, అనుభవాలను క్రోడకీరించి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు కలిసి చీనీ పంట సాగుపై పాటించాల్సిన పద్ధతులపై కరపత్రం ముద్రించి క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అనంత ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఫిరోజ్ ఖాన్, శ్రీసత్య సాయి జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, శాస్త్రవేత్తలు చక్రవర్తి, రామ కృష్ణపాల్, ఏకే దాస్, తిరుం గన్‌వేల్, ఉద్యాన పరిశోధన స్థానం రేకుల కుంట దత్తారెడ్డి, తిరుపతి చీనీ పరిశోన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, అనంతరాజ్ పేట సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణ, భూగర్భజల శాఖ డీడీ తిప్పేస్వామి, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.37

అనంతపురం రూరల్, జూలై 6: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.37 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం మార్కెట్‌కు 95 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.24 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 722 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రేపటి నుంచి ఉచిత ఇసుక

- మెట్రిక్ టన్ను ధర రూ.195
- రోజుకి ఒక్కొక్కరికి 20 మెట్రిక్ టన్నులు
- ఆధార్.. సెల్ నంబర్, చిరునామా ఇవ్వాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన కలెక్టర్ వినోద్ కుమార్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు వినోద్ కుమార్, అధికారులు

అనంతపురం టౌన్, జూలై 6: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఉచితంగా ఇసుకను సరఫరా చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేసిందని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఇసుక విధానంపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఒక మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.195 అని తెలిపారు. ఇందులో రీచ్ నుంచి ఇసుకను డిపో వరకూ తరలించడం, లోడింగ్ చార్జీ, రాయల్టీ చార్జీలు కలిపి ఉంటాయని తెలిపారు. ఒక రోజుకి ఒక వ్యక్తికి 20 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఇస్తామని తెలిపారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, ఇసుక ఎక్కడికి చేర్చాలో తెలిపే చిరునామా తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని అన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక పంపిణీ జరుగుతుందని అన్నారు.

ఏర్పాట్లు చేయండి..

ఉచిత ఇసుక పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాయదుర్గం మండలం జుంజరంపల్లి డిపోలో 58,160 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఏజెన్సీ ద్వారా టేకోవర్ చేయాలని సూచించారు. కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద సీజ్ చేసిన ఇసుక 13,278 మెట్రిక్ టన్నులు ఉందని, భద్రంగా చూసుకోవాలని ఆదేశించారు. పోలీసులు, వీఆర్‌ఓలను షిఫ్టులవారిగా భద్రతా విధుల్లో ఉంచాలని సూచించారు. జుంజరంపల్లి వద్ద సోమవారం ఇసుక పంపిణీని ప్రారంభిస్తామని తెలిపారు. ఉచిత ఇసుక విధానం వివరాలు ప్రజలకు తెలిసేలా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, పోస్టర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. అన్ని వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అన్నారు. కలెక్టరు, డీడీ మైన్స్ పేరిట ఉమ్మడిగా బ్యాంకు ఖాతా తెరవాలని, ఆ తరువాత క్యూ ఆర్ కోడ్‌ను ఇసుక డిపోల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ స్కాన్ చేస్తే డబ్బులు జాయింట్ అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు. ఇసుక పంపిణీతో సంబంధం ఉన్న అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

నిబంధనలను అమలు చేయండి: సీఎస్

ఉచిత ఇసుక విధానాన్ని నిబంధనల మేరకు జిల్లాలో అమలు చేయాలని కలెక్టరు, ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్‌కుమార్ ఆదేశించారు. ఉచిత ఇసుక విధానం అమలుపై శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

బడి రుణం తీర్చుకుంటా

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

శింగనమల, జూలై 6: తాను చదివిన పాఠశాల అభివృద్ధికి సహకరించి, బడి రుణం తీర్చుకుంటానని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని సలకంచెరువు జడ్పీ పాఠశాలలో 1997 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. అదే బ్యాచ్‌కు చెందిన ఎంఎస్.రాజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన గురువులు, తల్లిదండ్రులు చూపిన మార్గంలో వెళితే విజయం తథ్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. అనంతరం స్నేహితులతో సరదాగా మాట్లాడారు. అప్పటి గురువుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అనంతరం వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు దంపతులను అప్పటి విద్యార్థులు సన్మానించారు.



సలకంచెరువు పాఠశాలలో గురువులు, క్లాస్‌మేట్‌లతో ఎంఎస్ రాజు

మారాజు ఎమ్మెల్యే అయ్యాడు..

పేద కుటుంబంలో జన్మించి, చదువుకోనే రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడిన తమ చిన్ననాటి స్నేహితుడు ఎంఎస్ రాజు ఎమ్మెలే కావడం ఎంతో ఆనందంగా ఉందని 1997 టెన్త్ బ్యాచ్ చెందిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. రాజు పాఠశాలకు రావడంతో స్నేహితులు అతన్ని కలిసి ఆప్యాయంగా పలకరిస్తూ, చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు. తాను ఎమ్మెల్యే అయినా ఎప్పటికీ మీరాజునే అని ఎంఎస్ రాజు తన స్నేహితులతో పేర్కొన్నాడు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తనకు తెలియజేస్తే తన వంతు సహకారం అందిస్తానని మాటిచ్చారు.

మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం

వివిధ కారణాలతో మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు ఎస్ఎం రాజు ఆర్థిక సాయం అందజేశాడు. తనతోపాటు చదువుకున్న మృతి చెందిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చెప్పున సాయం అందజేశారు.

నేడు గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు

నార్పల, జూలై 6: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం సోమవారం రాత్రి 9 గంటలకు ఉంటుందని ఆలయ కార్య నిర్వహణాధికారి శోభ తెలిపారు. గూగూడులో సోమవారం నుంచి పది రోజుల పాటు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. స్వామివారి ప్రథమ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని అన్నారు. భక్తాదులు సమర్పించే తలానీలాలకు వేలం నిర్వహించామని, ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసులు రూ.25.65 లక్షలకు దక్కించుకున్నారని తెలిపారు.

టీబీ డ్యాంకు పెరిగిన వరద

బొమ్మనహాళ్, జూలై 6: తుంగభద్ర డ్యాంకు వరద పెరిగింది. శుక్రవారం 19,210 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో.. శనివారం 25,556 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 14 టీఎంసీలకు చేరాయి. అవుట్ ఫ్లో 190 క్యూసెక్కులు. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1593.19 అడుగుల వరకు నీరు చేరింది. డ్యాం ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, తీర్థనహళ్లి, చిక్కమగళూరు, వరనాడు, శృంగేరి తదితర చోట్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. దీంతో వరద పెరుగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1576.71 అడుగుల వద్ద 3.078 టీఎంసీల నిల్వలు ఉండేవి. 193 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 77 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

ఖాళీ చేసేదే లేదు

వైసీపీ నాయకుడి ఆధీనంలో అంగన్‌వాడీ భవనం

బొమ్మనహాళ్, జూలై 6: మండలంలోని గౌనూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని ఓ వైసీపీ నాయకుడు స్వాధీనం చేసుకున్నాడు. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం రూ.ఏడు లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టింది. వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక ఆ భవనమును పూర్తి చేయకుండా వదిలేసింది. అయితే ఈ భవనాన్ని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గోవింద ఆక్రమించుకుని ధాన్యం బస్తాలు, పత్తి, ఎరువుల బస్తాలు వేసుకొన్నాడు. భవనం స్వాధీనం చేయాలని ఐసీడీఎస్ అధికారులు కోరితే భవనం మా స్థలంలో ఉందని, ఖాళీ చేసేదే లేదని, అవసరం అయితే భవనాన్ని పడగొడతామని అన్నట్లు తెలిపారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో భవన నిర్మాణము పూర్తి చేసి అంగన్‌వాడీ సెంటర్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అంగన్ వాడీ సెంటర్‌ను ఆర్టీటీ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. తక్షణమే వైసీపీ నాయకుడి నుంచి అంగన్‌వాడీ భవనమును స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.





గౌనూరులో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్, అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న బస్తాలు, పత్తి

● అనంతపురం జిల్లా పామిడి మండలంలో.. 44వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉంటుంది ఓ చిన్న పల్లెటూరు. ఈ ఊరిలోని ఓ యువరైతుకు కర్ణాటక యువతితో వివాహం జరిగింది. వరుడికి కన్నడ రాదు. వధువుకు తెలుగు రాదు. అయినా వారిద్దరికీ పెద్దలు వివాహం జరిపించారు. కారణమేమిటో వేరే చెప్పనవసరం లేదు.

● గుత్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన రాముడు అనే రైతుకు 9 ఎకరాల చీనీ తోట ఉంది. ఆయనకు ఉన్నది ఒకే కుమారుడు. పదో తరగతి వరకు చదుకుని, ఆ తర్వాత వ్యవసాయంలోకి దిగాడు. ఎలాంటి దురలవాట్లు లేవు. కానీ 33 ఏళ్ల వయసొచ్చినా పెళ్లి కాలేదు. మొదట్లో తమ కులం అమ్మాయే కావాలని వెతికారు. ఆ తరువాత ఏ కులమైనా పర్వాలేదు.. అమ్మాయి దొరికితే చాలని అనుకున్నారు. ఇక్కడ సాధ్యం కాక.. కర్ణాటకలోని గుల్బర్గాకు వెళ్లి సంబంధం ఖాయం చేసుకున్నారు. ఎట్టకేలకు ఆ యువరైతు పెళ్లి చేసుకున్నారు.



వ్యవసాయం చేస్తున్న రైతన్నలు



మోగదే.. కళ్యాణవీణ..!

యువరైతులకు దొరకని పెళ్లి కూతుళ్లు

- సేద్యగాడికి పిల్లనివ్వని తల్లిదండ్రులు
- పదుల ఎకరాలు.. రూ.కోట్ల ఆస్తి ఉన్నా..
- అగ్రవర్ణ రైతాంగ కుటుంబాల్లో సంక్షోభం
- దూర ప్రాంతాలకు వెళ్లి.. కులాంతర వివాహాలు
- వధువుకు బంగారం.. తల్లిదండ్రులకు డబ్బు..
- బ్రోకర్లకు రూ.లక్షలు ఇచ్చి.. సంబంధాల వేట..
- రెండేళ్లలో 650కి పైగా ఇలాంటి పెళ్లిళ్లు

'పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు తాళాలు.. తలంబ్రాలూ.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు..' అని నూరేళ్ల జీవితాన్ని చాలా ఈజీగా చెప్పేశారు ఆత్రేయ..! ఆయన కాలం అట్లుండేది మరి..! కానీ పెళ్లంటే రైతు బిడ్డలకు ఇప్పుడు సినిమా కనిపిస్తోంది. సేద్యం చేసేవారికి పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అనంతపురం జిల్లాలో వందలాది మంది యువకులు బ్రహ్మచారులుగా మిగిలిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ పిల్లదొరకడం కష్టమని భావించి.. చాలామంది తెలంగాణ, కర్ణాటకలోని మారు మూల ప్రాంతాలకు వెళుతున్నారు. అక్కడ కులం, గోత్రంతో సంబంధం లేకుండా.. చివరకు భాష రాకపోయినా సరే.. ఎదురు కట్నం ఇచ్చి, గుట్టుగా పెళ్లి చేసుకుని మరీ వస్తున్నారు. వ్యవసాయ రంగం దీనస్థితికి అద్దం పడుతోంది ఈ పరిణామం. అన్నదాతలుగా ఖ్యాతి పొందిన రైతుల ఇంట కూతురు పెళ్లి జరుగుతోందేగాని.. కొడుక్కు పెళ్లి చేయడం మాత్రం కష్టంగా మారింది. చిన్నపాటి టీస్టాల్ పెట్టుకున్నవారికి, అత్తెసరు జీతంతో బతికే చిరుద్యోగికి సైతం అమ్మాయి దొరుకుతోందిగానీ.. పదుల ఎకరాల భూమి, రూ.కోట్ల ఆస్తి, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నా.. సేద్యం చేసేవారికి మాత్రం పిల్ల దొరకడం లేదు. నిత్యం కష్టాలు, నష్టాలమయమైన వ్యవసాయం చేసేవారి వల్ల తమ బిడ్డలు సుఖపడరనే భావన ఆడపిల్లల తల్లిదండ్రుల్లో నెలకొంది. వ్యవసాయదారులకు ఖచ్చితమైన ఆదాయం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని విశ్లేషకులు అంటున్నారు. వ్యవసాయం గిట్టుబాటుగా మారేదాకా ఈ పరిస్థితిలో మార్పు రాదని కూడా స్పష్టంగా చెబుతున్నారు. జిల్లాలో యువరైతులకు సమీప బంధువులేకాదు.. రాయలసీమ ప్రాంతంలో ఏ ఒక్కరూ పిల్లనిచ్చేందుకు ఇష్టపడటం లేదు. చేసేదేమీ లేక చాలామంది పక్కరాష్ట్రాల్లో వధువులను వెతుక్కుంటున్నారు. ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంటున్నారు.

- అనంతపురం టౌన్/కల్చరల్/రాప్తాడు/యాడికి



జీవన చిత్రం

అనంతపురం జిల్లా యువరైతులు గడిచిన రెండేళ్లలో సుమారు 650 మంది కులమతాల పట్టింపులు వదిలేసి.. సుదూర ప్రాంతాల యువతులను పెళ్లి చేసుకున్నట్లు అంచనా. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, తెలంగాణలోని ఆదిలాబాద్, వరంగల్, కర్ణాటకలోని గుబ్బర్గా, మంగళూరు తదితర ప్రాంతాల అమ్మాయిలు వందలమంది అనంతపురం జిల్లా కోడళ్లు అయ్యారు. ఇవేమీ ఆషామాషీగా జరిగిన వివాహాలు కాదు. బ్రోకర్లకు లక్షలాది రూపాయలు ముట్టజెప్పి మరీ చేసుకున్న పెళ్లిళ్లు..! ఇక ఎదురుకట్నం మొత్తంగా


రెండేళ్లలో 650 వివాహాలు



రూ.కోట్లలో చెల్లించి ఉంటారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి వివాహాలు వేల సంఖ్యలో జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇలాంటి దూరాభార పెళ్లిళ్లు జరిగేందుకు ముందు రెండు కుటుంబాల మధ్య ఆర్థిక ఒప్పందాలతోపాటు బంధాలకు సంబంధించిన ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు. 'చూడప్పా.. మేము పిల్లనిస్తున్నాం. మీరు డబ్బులు ఇస్తున్నారు. ఒకసారి మా పాపను మీ ఇంటికి పంపిన తరువాత ఇంక మాకు సంబంధం లేదు. మాటి మాటికీ అంతదూరం వచ్చిపోవాలంటే మాకు కుదరదు. ఏ కష్టం వచ్చినా మీరే చూసుకోవాలి..' అని అమ్మాయి తరపువారు తెగేసి చెబుతున్నారట. సాధారణంగా వివాహం జరిగిన తరువాత కూడా అమ్మాయి తరపువారికి ఖర్చులు భారీగానే ఉంటాయి. తిరిగింపులు మరిగింపులు.. సారె, తొలి కాన్పునకు పుట్టింటికి తీసుకెళ్లడం వంటివి ఇందులో భాగం. కానీ ఇలాంటివేవీ తమకు సంబంధం లేదని వరుడి తరపువారికి వధువు కుటుంబ సభ్యులు ఆదిలోనే చెబుతున్నారని సమాచారం. అక్కడి పేదరికం అమ్మాయిలకు, ఇక్కడి వ్యవసాయ సంక్షోభం యువ రైతులకు ఇలా శాపంగా మారుతోంది.



అగ్రవర్ణాలవారికే ఇబ్బందులు



పొరుగు రాష్ట్రాలు, ఇతర జిల్లాలకు వెళ్లి పెళ్లికూతుళ్లను తెచ్చుకుంటున్న యువ రైతుల్లో ఎక్కువశాతం అగ్రవర్ణాల వారే ఉన్నారు. వీరిలో చాలామంది మధ్యలోనే చదువు మానేసి.. వ్యవసాయం చేసుకుంటున్నవారు ఉన్నారు. గ్రామీణ కుటుంబాలు కావడం, కుల కట్టుబాట్లు, పూర్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెత్తందారీ లక్షణాల కారణంగా సాధ్యమైనంత వరకూ సొంత కులాల అమ్మాయిలను పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాక.. వయసు పెరిగి, ఇక పెళ్లి జరగదేమో అనే సందిగ్ధంలో పడినవారు కులాంతర వివాహాలకు సిద్ధపడుతున్నారు. కానీ తమ ప్రాంతంలోని దిగువ కులాల అమ్మాయిలను చేసుకునేందుకు కులం, హోదాలు అడ్డొస్తున్నాయి. అందుకే దూర ప్రాంతాల అమ్మాయిలను చేసుకుంటున్నారు.



● యాడికి పట్టణానికి చెందిన ఓ రైతుకు రూ.కోట్ల విలువజేసే నాలుగు ఎకరాల పొలం ఉంది. రూ.80 లక్షల వరకు బ్యాంకు బ్యాలెన్సు ఉంది. తనది రెడ్డి సామాజికవర్గం. పదో తరగతి వరకు మాత్రమే చదివాడు. వ్యవసాయంలో దిట్ట. కానీ పెళ్లి కాలేదు. 25 ఏళ్ల నుంచి పెళ్లి కూతురు కోసం వెతుకుతూనే ఉన్నారు. ఇప్పుడు అతని వయసు 52 ఏళ్లు..! పిల్ల దొరక్కపోవడానికి ఒకే ఒక్క కారణం.. వ్యవసాయం..! ఎన్నో సంబంధాలను చూశారు. ఇంటి వరకూ చాలా సంబంధాలు వచ్చాయి. కానీ.. 'సేద్యమొకటేనా..? వేరే ఏమీ చేయడా..?' అని ప్రశ్నించి వెళ్లిపోయారు.

పిల్లనిచ్చేవారు కరువయ్యారు..



మేము వయసులో ఉన్నప్పుడు భూములున్న యువ రైతులకు ఏరికోరి పిల్లనిచ్చేవారు. ఉద్యోగులకు పిల్లనిచ్చేందుకు ఇష్టపడేవారు కాదు. 'వాడు జీతగాడు..' అన్నట్లు తేలిగ్గా చూసేవారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. ఒకరి కింద పనిచేసేటోళ్లకే చక చకా పెళ్లిళ్లు అవుతున్నాయి. పదుల ఎకరాల భూములున్నా, వ్యవసాయం బాగా చేస్తున్నా.. పెళ్లి కూతురు దొరకడం లేదు. చాలా మంది యువ రైతులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు. మా మండలంలో చాలామంది కర్ణాటకలోని గుల్బర్గా, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి అమ్మాయిలను పెళ్లి చేసుకొని వస్తున్నారు. మా ఊర్లో పెళ్లికాని యువ రైతులు పదిమందిదాకా ఉన్నారు.

- నరసింహులు, నగరూరు, యాడికి మండలం

భూమి ఉండల్ల.. కానీ సేద్యం చెయ్యకూడదంట..



అప్పట్లో గడ్డివాములు, పేడ దిబ్బలు, ఇంట్లో గింజలు, భూమిని చూసి పిల్లనిచ్చేవారు. ఇవన్నీ ఎక్కువగా ఉంటే వెంటనే మంచి మాట చేసుకునేవాళ్లు. సేద్యం చేసే యువకులకు ఇట్లనే పిల్ల దొరికేది. బంగారు, డబ్బులు కట్నంగా ఇచ్చి- ఇంటికాడ ఘనంగా పెండ్లి చేసి అత్తారింటికి సాగనంపేవాళ్లు. ఇప్పుడు భూమి ఉండల్ల... కాని సేద్యం చేయకూడదట. భూమి ఉండి.. ఉద్యోగం చేసే యువకుడికైతే పిల్లనిస్తాండారు. సేద్యం మాత్రమే చేస్తున్నాడంటే.. 'మా బిడ్డ పొలానికి యాడ పోతాది...? ఎండ, గాలికి సేద్యం పని యాడ చేస్తాది..?' అని ఆడపిల్ల తల్లిదండ్రులు అంటాండారు. సేద్యం కాకుండా చిన్న ప్రైవేటు ఉద్యోగమైనా కానీలే.. అని ప్రైవేటు ఉద్యోగం చేసేవాళ్లకే పిల్లనిస్తుండారు.

- ఎర్రిస్వామి, రాప్తాడు

తల్లిదండ్రులకు నరకం

బెళుగుప్ప మండల కేంద్రానికి చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో మూడు గ్రామాలు ఉంటాయి. ఒక ఊరిలో సుమారు 500 కుటుంబాలు ఉంటాయి. అందరూ కమ్మ సామాజికవర్గం వారే. పూర్వం నుంచి వీరివి పెద్ద పెద్ద భూస్వామ్య కుటుంబాలు. ఉమ్మడి కుటుంబాలు విడిపోవడంతో కుటుంబాల భూముల విస్తీర్ణం తగ్గింది. అయినా.. ఒక్కొక్కరికి కనీసం 30 నుంచి 40 ఎకరాల పొలం ఉంటుంది. కొందరు చదువుకుని ఉద్యోగాలకు వెళ్లిపోయారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారికి ఏ సమస్యా లేదు. కానీ ఊళ్లోనే ఉండి.. వ్యవసాయం చేస్తున్నవారికి మాత్రం పెళ్లి కావడం లేదు. వ్యవసాయం చేస్తున్న కొడుకులకు పెళ్లి చేయడం తల్లిదండ్రులకు నరకప్రాయంగా మారింది. చాలామంది సంబంధాలు చూసి చూసి.. విసిగిపోయారు. చివరకు ఇతర ప్రాంతాలకు వెళ్లి కులం, గోత్రంతో సంబంధం లేకుండా ఆడబిడ్డను కొనుగోలు చేసి మరీ పెళ్లి చేస్తున్నారు. ఆ ఊరికి చెందిన ఇద్దరు రైతులు బ్రోకర్ల సాయంతో కర్ణాటకకు వెళ్లి.. ఆడబిడ్డ తల్లిదండ్రులకు డబ్బులిచ్చి పెళ్లి కూతుళ్లను తెచ్చుకున్నారు. ముగ్గురి వయసు 40 ఏళ్లు దాటింది. ఇప్పటికీ పెళ్లి కాలేదని ఆ ఊరి జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే మండలంలోని మరో పల్లెలో 40 ఎకరాల పొలం ఉన్నా.. కొడుక్కు పెళ్లి కాలేదన్న మనోవేదనతో కుంగిపోయి ఓ తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికీ ఆ రైతు బిడ్డ బ్రహ్మచారిగానే మిగిలిపోయాడు.

గడ్డివాములు, ఎరువు దిబ్బలు చూసి పిల్లనిచ్చేవారు..



అప్పట్లో పెద్దోళ్లు పెళ్లి సంబంధాలు చూడటానికి వస్తే.. ఎన్నెకరాల భూమి ఉంది..? దొడ్లో గడ్డివాములు ఎన్ను న్నాయి..? అని చూసేవారు. ఎరువు దిబ్బలు, ఇంట్లో తిండి గింజలు, కొట్టంలో ఎద్దులను పరిశీలించేవారు. భూమి ఎంత ఎక్కువ ఉంటే అంత ప్రాధాన్యం ఉండేది. అట్లాంటి కుటుంబాలకు పిల్లనిచ్చేకి ఎగబడేవారు. వరకట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి చేసి అత్తారింటికి పంపేవారు. అప్పటికీ ఇప్పటికీ కాలం మారింది. ప్రస్తుతం వ్యవసాయం చేసే యువకులకు పిల్లనివ్వడం కష్టంగా మారింది. కొన్ని సామాజికవర్గాలలో వ్యవసాయం చేసే యువ రైతులకు పిల్లనివ్వం అని తెగేసి చెబుతున్నారు. దీంతో వారు దూర ప్రాంతాల వెళ్లి వేరే కులాల యువతులకు బంగారం పెట్టి, ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు.

- ఈశ్వరయ్య, రాప్తాడు

● యాడికి మండలంలోని ఓ పల్లెకు చెందిన కమ్మోళ్ల పిల్లోడిది ఇంకో కథ. తనకు పదెకరాల పొలం ఉంది. వేరుశనగ, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు సాగుచేస్తుంటాడు. ఏడాదికి రూ.10 లక్షలకు పైగా పంటల దిగుబడి తీస్తాడు. తనకు 25 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి పెళ్లి సంబంధాలను చూడటం మొదలు పెట్టారు. 'సేద్యగాడికి పిల్లనెలా ఇచ్చేది..?' అని అటువైపు వారు అనేవారు. అలా ఓ పదేళ్లు గడిచాయి. ఆ యువకుడి వయసు 35 ఏళ్లకు చేరింది. ఇక్కడే వెతికితే అయ్యే పని కాదని అనుకున్నారు. కులం.. ప్రాంతం పట్టింపులు లేకుండా.. దూర ప్రాంతాల్లో సంబంధాలు వెతకడం ప్రారంభించారు. తెలంగాణలో ఓ అమ్మాయి దొరికింది. ఆరు తులాల బంగారం, రూ.2 లక్షల నగదు ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకున్నాడు. అంటే.. గురజాడ కాలంనాటి కన్యాశుల్కం అన్నమాట..!







పరిష్కారం కనుగొనాలి..



వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను కాపాడేందుకు ఎంఎస్ స్వామినాథన్ చేసిన సిఫారసులు ఇప్పటికీ అమలు కాకపోవడం నేటి ఈ దుస్థితికి కారణం. వ్యవసాయదారులకు పెళ్లిళ్లు జరగడమే సమస్యగా మారడం సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది. ఇప్పటికే రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు తోడుగా సామాజిక అభద్రత ఏర్పడితే అది అశాంతికి దారితీస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు వ్యవసాయ సంక్షోభంతోపాటు సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలి.

- వి.రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

చిన్నదైనా సరే.. ప్రైవేటు ఉద్యోగం చూసుకోవాలట..!





రాప్తాడు మండలంలో ఓ పల్లెటూరి రైతుకు ఒక్కడే కొడుకు. రెడ్డోళ్ల పిల్లోడు..! చూడ చక్కని రూపం. వారికి 15 ఎకరాల పొలం ఉంది. సొంత ఇల్లు, ట్రాక్టర్ ఉన్నాయి. మంచి కుటుంబం అన్న పేరుంది. వేరుశనగ, టమోటా, బెండ, వరి తదితర పంటలను సాగు చేస్తాడు. ఏడాదికి కనీసం రూ.10 లక్షలు సంపాదిస్తాడు. రాజకీయాల్లోనూ చురుగ్గా ఉంటాడు. కానీ ఏం లాభం..? ఎవ్వరూ పిల్లనివ్వడం లేదు. సొంత సామాజికవర్గం అమ్మాయి దొరికితే.. ఎదురు కట్నం ఇచ్చేందుకూ తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారు. 'ఆడపిల్లకు బంగారం పెడతాం. వాళ్ల అమ్మానాయనకు డబ్బులు ఇస్తాం. పెళ్లి ఖర్చు ఎంతైనా మేమే పెట్టుకుంటాం. మా వాడికి పిల్లను చూడండి..' అని బంధువులకు, తెలిసినవారికి చెబుతున్నారు. 'సేద్యం చేస్తున్నాడంటే పిల్లను ఎవరిస్తారు..? యాదో ఒకటి.. చిన్న ప్రైవేటు ఉద్యోగమైనా చూసుకోమనండి...' అని తేలిపోతున్నారట అందరూ..! ఇప్పుడు ఆ యువ రైతు వయసు 30 ఏళ్లు.

● యాడికి మండల కేంద్రానికి సమీపంలో ఉంటుంది ఆ ఊరు. కమ్మ సామాజికవర్గానికి చెందిన ఓ రైతు బిడ్డ డిగ్రీ వరకు చదివాడు. ఐదెకరాల పొలం ఉంది. ఎటువంటి అప్పులు లేవు. రూ.20 లక్షలకు పైగా నగదులో ఉన్నాడు. వ్యవసాయం మాత్రమే చేస్తాడు. తన కాళ్లపై తాను నిలబడ్డాడు. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి 26 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి పెళ్లి సంబంధాలను చూశారు. దాదాపు 14 ఏళ్లపాటు సంబంధాలను చూశారు. వ్యవసాయం చేస్తున్న కారణంగా అతనికి పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో విసుగొచ్చి.. 40 ఏళ్లు దాటిన తరువాత వివాహ ప్రయత్నాలను మానేశాడు. ఇప్పుడు అతని వయస్సు 54 సంవత్సరాలు.



ఆలోచనలు మారాయి..

అందరూ కాలం మారిందటున్నారు. కాలం కాదు.. మనషుల ఆలోచనలు మారాయి. పూర్వం భూములు ఎంత ఎక్కువ ఉండి, కష్టపడి పనిచేసుకునే కుటుంబాలవారికి ఆడపిల్లలను ఇచ్చి పెళ్లి చేసేవాళ్లం. ఇపుడు అంతా రివర్స్ అయింది. భూములు ఉండాలి. ఎక్కడో ఏదో ఉద్యోగం చేయాలి. అక్కడ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఉండకూడదు. అల్లుడు, బిడ్డ మాత్రమే ఉండాలి. ఇదీ.. ఆడపిల్లల తల్లిదండ్రుల ఆలోచన. ఆడపిల్లలకు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారు. 'వ్యవసాయం చేసేవారికి పిల్లనిస్తే మన కూతురు నిత్యం కష్టపడాలికదా?' అని.. రైతుకు పిల్లనివ్వడం లేదు. అందుకే సేద్యం చేసుకుని బతికే మగపిల్లలకు పెళ్లిళ్లు కాక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొందరు ఎలాంటి సంబంధంలేని ప్రాంతాలకు వెళ్లి... అక్కడ కులం, గోత్రం ఏదీ చూడకుండా.. ఆడపిల్లల తల్లిదండ్రులకు కొంత డబ్బు ఇచ్చి పెళ్లి చేసుకొని వస్తున్నారు. అలా వచ్చిన ఆడపిల్లలు కూడా నచ్చితేనే ఉంటున్నారు. లేకపోతే వెళ్లి పోతున్నారు. రాకెట్లలో ఒక అమ్మాయిని ఇలాగే చేసుకొని వచ్చారు. ఆమె ఇక్కడ ఉండలేక వెళ్లిపోయింది. ఇప్పటికీ కులం, గోత్రం, సంప్రదాయం అనుకునేవారు పెళ్లి చేసుకోకుండా అలాగే ఉండి పోతున్నారు. రైతులు ఉండే ఒక్కో గ్రామంలో కనీసం నలుగురైదుగురు పెళ్లి కాని వారు ఉంటారు. రైతుకు ఇలాంటి కష్టాలు వస్తాయని కలలో కూడా అనుకోలేదు.

- మాలపాటి ఎర్రిస్వామి, ఎర్రగుడి కొట్టాల, బెళుగుప్ప మండలం

మా పాప పొలానికి వెళ్లలేదు..

రాప్తాడు మండలంలోని ఓ పల్లెలో కమ్మ, రెడ్డి సామాజికవర్గం యువకులు పది మందికి పైగా పెళ్లీడుకొచ్చారు. ఎకరాలకు ఎకరాలు భూములు, సొంతిళ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. ఏటా పంటలు బాగా పండిస్తారు. ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు. అయినా ఎవరికీ పిల్ల దొరకడం లేదు. ఎంత ఆస్తి ఉన్నా.. సేద్యగాడికి పిల్లనివ్వడం అంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. 'పంటలు సరిగా పండవు. గిట్టుబాటు ధరలు ఉండవు. పైగా మా పాప పొలానికి వెళ్లలేదు. రైతులకు ఇచ్చి కష్టపెడతామా ఏంది..?' అని ఆడపిల్లల తల్లిదండ్రులు అంటున్నారట..! ఇట్లయితే పెళ్లి కావడం కష్టమేనని భావించి.. చాలామంది దళారులను ఆశ్రయిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణలోని మారుమూల ప్రాంతాలకు చెందిన వేరే కులాల అమ్మాయిలకు బంగారు పెట్టి, ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుని వస్తున్నారు. దళారులకు వేలాది రూపాయలు ముట్టజెప్పుతున్నారు.



శాస్త్రీయ విజ్ఞానాన్ని ఆచరించినప్పుడే దేశాభివృద్ధి

● జేవీవీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్


సభ్యత్వ నమోదు చేస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 6: శాస్త్రీయ విజ్ఞానాన్ని చదవడంతో పాటు ఆచరించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని జేవీవీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగానే పిలవబడుతోందని, మనతోపాటు లేదా మన తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన దేశాలు ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలుగా పిలవబడుతున్నాయన్నారు. మనదేశం మాత్రం అభివృద్ధి దశలోనే ఉందని, దీనంతటికీ కారణం ఇతర దేశాలు శాస్త్రీయ విజ్ఞానాన్ని చదవడంతోపాటు ఆచరిస్తుండగా మనదేశంలో కేవలం చదివి, ఆచరించకపోవడమేనన్నారు. దీనికితోడు మూఢనమ్మకాలను ఎక్కువ విశ్వసిస్తున్నామన్నారు. విద్యార్థిదశనుంచే ప్రతిఒక్కరికీ శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన కల్పించి, ఆచరించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలల్లో జేవీవీ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

అనంతపురం కల్చరల్, జూలై 6: ఆర్థిక కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. రామచంద్రనగర్‌లో నివాసముంటున్న మీనా, రాజు దంపతులకు ఇద్దరు పిల్లలు. రాజు వెన్నెముక సమస్యతో బాధపడుతూ ఏ పనీ చేయలనేని స్థితిలో ఉన్నాడు. దీంతో కుటుంబ పోషణకోసం మీనా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వీరి ఆర్థిక ఇబ్బందులను గమనించిన ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలా మురళి శనివారం కుటుంబాన్ని కలిసి రెండు నెలలకు సరిపడా 33 రకాల నిత్యావసర సరుకులు, రూ.2వేలు నగదు అందజేశారు. ట్రస్టు సభ్యులు పల్లవి, నవ్యశ్రీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలి

చెన్నేకొత్తపల్లి, జూలై 6: ఎరుకుల ఆరాధ్యదైవం ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏపీ ఎరుకుల ప్రజాపోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జలసురేశ్ ప్రభుత్వాన్ని కోరారు. చెన్నేకొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సోమవారం శ్రీసత్యసాయిజిల్లా కేంద్రంలో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యమ్మ ఆలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎరుకుల పోరాటసమితి జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు రుద్ర, పోలయ్య, అశోక్ పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

శింగనమల జూలై 6: నియోజకవర్గ కేంద్రంలోని కేజీబీవీని తరిమెల వైద్యాధికారి శంకర్ నాయక్ తనిఖీ చేశారు. శనివారం పాఠశాలలో వంటశాలను పరిశీలించారు. వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పించారు.శింగనమల కమ్యూనిటీ సెంటర్‌లో డయేరియాతో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో అశ్వర్థ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

రాప్తాడు, జూలై 6: ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. పంగల్‌రోడ్డు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం సాయంత్రం విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్ఓ శివప్రసాద్, ప్రిన్సిపల్ పద్మజాదేవి, సూపర్‌వైజర్ అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఏఎన్ఎం అనిత, ఆశా, అరుణ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గార్లదిన్నె, జూలై 6: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంపీపీ తరిమెల ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించిన విద్యార్థి ధరణికి శనివారం తరిమెల రాధమ్మ జ్ఞాపకార్థం రూ. 20వేలు ప్రోత్సాహక బహుమతి ఆయన అందచేశారు. ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. పిల్లలు ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు


అనంతపురం అర్బన్, జూలై 6: జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. పశుగ్రాస విత్తనాల రకాలు, పశుగ్రాసం ప్రాముఖ్యత, పశువులకు పశుగ్రాసం ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాల దిగుబడి పెరిగేందుకు పాటించాల్సిన పలు జాగ్రత్తలను వివరిస్తారన్నారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

అనంతపురం అర్బన్, జూలై 6: జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరమని పశుసంవర్థక శాఖ ఏడీ సురేష్ సూచించారు. శనివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో జూనోసిస్‌డేను నిర్వహించారు. ఏడీ సురేష్ మాట్లాడుతూ పెంపుడు, వీధికుక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూనోసిస్‌డేని పురస్కరించుకొని ప్రతి ఏడాది వెటర్నరీ ఆస్పత్రుల్లో కుక్కలకు రేబీస్ నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. మరో మూడు రోజులపాటు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. అనంతరం కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేశారు. పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర, వెటర్నరీ డాక్టర్లు సునీత, సుచరిత, పశు వైద్య సహాయకులు జాఫర్ వలి, గీతా, కమలాకర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

● ఒకేరోజు రెండు గ్రామాల్లో 10 తులాల బంగారం చోరీ


ముక్తాపురంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ధర్మవరం రూరల్ (కనగానపల్లి), జూలై 6: కనగానపల్లి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే రోజు రెండు గ్రామాల్లో 10తులాల బంగారాన్ని చోరీ చేశారు. కనగానపల్లి పోలీసులు తెలిపిన మేరకు మామిళ్లపల్లి గ్రామంలో జయరామిరెడ్డి తన భార్య సావిత్రితో కలిసి ఆరుబయట నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు దోమతెరని కట్ చేసి సావిత్రి మెడలోని 3 తులాల తాళిబొట్టు గొలుసును లాక్కొని పారిపోయారు. ఆమె తేరుకొని కేకలు వేయడంతో అప్పటికే దుండగలు ఉడాయించారు. అలాగే ముక్తాపురం గ్రామంలో వెంకటనారాయణరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబయట నిద్రిస్తున్నారు. దొంగలు ఇంటి తాళాలను పగులగొట్టి కబోర్డులో ఉన్న చీరల కింద, డబ్బాల్లో ఉన్న 7 తులాల బంగారాన్ని, సెల్‌ఫోన్‌ను అపహరించారు. శనివారం తెల్లవారజామున లేచి చూడగా అప్పటికే తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బంగారు చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే బాధితులు కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఇరువురిని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ క్లూస్‌టీంను రప్పించి ముక్తాపురంలోని వెంకటనారాయణరెడ్డి ఇంట్లో వేలిముద్రలను సేకరించారు.

చీనీ సాగులో మెలకువలు పాటించండి

● శాస్త్రవేత్తల బృందం సూచన


ఎండిన చీనీ చెట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గార్లదిన్నె, జూలై 6: చీనీ సాగులో మెలకువలు పాటించాలని శాస్త్రవేత్తల బృందం సూచించింది. భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం బెంగళూరు నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తల బృందం సభ్యులు రాజేశ్వర్ సింగ్, వాస్కాసింగ్, గణేష్‌మూర్తి, చక్రబర్తీ, రామ్‌క్రిష్ణపాల్, ఏకే దాస్, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, దత్తారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, హెచ్‌ఓ రత్నకుమార్ శనివారం సాయంత్రం గార్లదిన్నె, మర్తాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గేట్ కృష్ణారెడ్డి, ఆవులక్రిష్ణయ్య, రామసుబ్బయ్య చీనీ తోటలను, నర్సరీలను పరిశీలించారు. చీనీ సాగు విధానం, చీనీ పంటకు సోకే తెగుళ్లు, తెగుళ్లతో ఎండిపోయిన చెట్లను, వాటి వేర్లను పరిశీలించారు. అనంతరం చీనీ సాగులో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రైతులతో చర్చించారు. చీనీ సాగుకు వేరుకుళ్లు తెగులు సోకి చెట్లు పూర్తిగా ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు బృందం ఎదుట వాపోయారు. వేరుకుళ్లు తెగులుతో పాటు వివిధ చెట్లకు బంక కారవడం, వివిధ తెగళ్లు సోకుతున్నాయని వాటి నివారణకు రూ.లక్షలు ఖర్చు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేరుకుళ్లు తెగులు నివారణకు తగిన సలహాలు ఇవ్వాలని కోరారు. పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ చీనీ సాగుకు అధికంగా నీరు వదలడంతో వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే డ్రిప్ ద్వారా రసాయనిక ఎరువులు, మందులు అధిక మోతాదులో ఒకే చోట వేయడం కూడా ప్రధాన కారణంగా గుర్తించారు. చెట్లకు ప్రతి సంవత్సరం మట్టితోలడం వల్ల గ్రాఫ్టెడ్ అయినచోట ఫంగస్ వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. చీనీ సాగులో పచ్చిరొట్ట ఎరువులు వేసి, పూత రాకముందే జీలుగ, మినుములు వంటి పంటలను సాగుచేసుకోవాలన్నారు. బావిష్టన్, ట్రైకోడెర్మా, సూడోమోనస్ వంటివి చెట్లు పాదిలో వేసుకుంటే తెగళ్లు నివారించుకునే అవకాశం ఉంటుందన్నారు. పొలుసు పురుగు నివారణకు మినరల్ ఆయిల్ వాడాలని తదితర సలహాలు సూచనలు ఇచ్చారు. రైతులు వెంకటేష్, దాసరి శీన, శేఖర్, దామోదర్, రామాంజి, సంజీవరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

ముగిసిన టెండర్ల ప్రక్రియ..!

అనంతపురం రూరల్, జూలై 6: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో 9 పనులకు సంబంధించి సీల్డ్ టెండర్లను శనివారం ఓపెన్ చేశారు. మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆధ్వర్యంలో టెండర్లను తెరిచారు. పండ్ల, పశువుల మార్కెట్ క్లీనింగ్ సి. వినోద్ కుమార్ అనే వ్యక్తి 79,500(ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు), రూ.39,500ప్రతినెలకు (అక్టోబరు నుంచి జనవరి), పశువుల మార్కెట్‌లో ప్రతి వారం పేడను ఊడ్చి బయటకు తరలింటను నెలకు రూ.25,600లకు దక్కించుకున్నారు. పండ్ల మార్కెట్‌లో సంచార (మొబైల్) ఫలహారశాల నిర్వాహణ ఏడాది కాలానికి బి.రామకృష్ణ, రూ.1.85లక్షలకు దక్కించుకున్నారు. పశువుల మార్కెట్ యార్డులో గొర్రెలు, పశువులను కట్టు తాళ్ల దుకాణం నిర్వహణ ఏడాదికాలనికి మచ్చన్న అనే వ్యక్తి రూ.18లక్షలకు దక్కింది. పశువుల మార్కెట్ యార్డులో ఫలహారశాల నిర్వాహణ రూ.2.61లక్షలు, సోడాలు, చల్లని పానీయలు నిర్వహణ రూ.1.06లక్షలకు ఎం. రమణయ్య దక్కించుకున్నారు. పశువుల మార్కెట్‌లో టీస్టాల్ నిర్వహణను ఏడాది కాలనికి రూ.3.75లక్షలకు ఓం.శేఖర్ దక్కించుకోగా..మార్కెట్ యార్డులో 40ఎంటీఎస్ వేబ్రిడి నిర్వహణ టెండర్‌ను జి.రామాంజనేయులు రూ.2,09,700కు, చీనీకాయల గ్రేడింగ్ మిషన్ నిర్వహణ ఏడాది కాలనికి ఎంఈ శ్రీనివాస్ అనే వ్యక్తి రూ.60,300కు దక్కించుకున్నారు.

సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోల అందజేత


13వ వార్డు సచివాలయానికి ఫొటోలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 6: నగరంలోని 13వ వార్డు సచివాలయానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహ అందజేశారు. శనివారం సచివాలయం అడ్మిన్ ప్రతాప్‌కు చిత్రపటాలను అందజేశారు. టీడీపీ నాయకులు నాగరాజు, సూరి, నారాయణ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థినులతో డిప్యూటీ డీఈఓ, పాఠశాల సిబ్బంది

అనంతపురం విద్య, జూలై 6: విద్యార్థులు బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం రామచంద్రానగర్‌లో ఉన్న సెయింట్ అగస్టిన్ స్కూల్‌లో స్టూడెంట్స్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఎన్నికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సుజాత, చర్చి ఫాదర్ జోసెఫ్, సిస్టర్ అనంతా, ఆఫీస్ ఏవో సంధ్యారాణితో కలసి డిప్యూటీ డీఈఓ విద్యార్థులను అభినందించారు. విద్యార్థి నేతలు ఝాన్సీ, నప్రా, భావిక, తేజ ఇతర విద్యార్థులను అభినందించి, వారికి బ్యాడ్జీలు బహూకరించారు.

మేధాపాట్కర్‌కు జైలు శిక్ష తీర్పును నిలిపివేయాలి


మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జూలై 6: మేధా పాట్కర్‌కు జైలుశిక్ష విధిస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం రైతుసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్మదా ప్రాజెక్ట్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సుదీర్ఘంగా పోరాటం చేసిన సామాజిక కార్యకర్త మేధాపాట్కర్‌కు ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధించడం సమంజసం కాదన్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షులు రూపాక్షి, రాజారామ్‌రెడ్డి, దస్తగిరి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

రాప్తాడు, జూలై 6: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం ఉదయం ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పని కోరిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తామన్నారు. కూలీలకు బిల్లులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్, జూలై 6: జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నట్లు జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కవి కంబదూరి షేక్ నబిరసూల్ రచించిన 'నిత్యనవనీతం నబిరసూల్ సుభాషితం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏడు శనివారాల వ్రతాలకు శ్రీకారం


వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్, జూలై 6: శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో శనివారం ఏడుశనివారాల వ్రతాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజలు నిర్వహిస్తుండగా భక్తులు సామూహికంగా ఏడు శనివారాల వ్రతాలను ఆచరించారు. మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దార్శనికుడు జగ్జీవన్‌రామ్

● మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఎస్ రాజు

అనంతపురం సెంట్రల్, జూలై 6: కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ జగ్జీవన్‌రామ్ ప్రజాపాలన దార్శనికుడని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కొనియాడారు. శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ, తెలుగుయువత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రజలకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. తెలుగుయువత వెంకటప్ప, లక్ష్మీనారాయణ, ఎస్సీఎస్టీ సంఘా జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, వెంకటప్ప, రామాంజనేయులు, సుంకన్న, వన్నూరప్ప, నాగరాజు, ఓబులేసు, ఆదినారాయణ, రుషివర్ధన్, నాగరాజు, జాంబవంతుడు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కు టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహ, నాయకులు ఉమర్ ముక్తియార్, రాజేష్, చంద్రశేఖర్, శేఖర్, అమర్, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నార్పల: నార్పల క్రాసింగ్ వద్ద నున్న ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆ సంఘం శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి రంగాపురం పుల్లప్ప ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎస్సీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకలరాజు, నాయకులు ఏపీ కుళ్లాయప్ప, నార్పల జయన్న, తుంపెర రమణయ్య నారాయణ, కేశేపల్లిధన, నారాయణ, కట్టెల రామాంజి, నార్పల లక్ష్మన్న, చిన్నకొట్ల శ్రీరాములు, తుంపెర రామాంజి, తుంపెర మోహన్ పాల్గొన్నారు.


జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


నార్పలలో ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి

సహకార బ్యాంకులతోనే బడుగు వర్గాల అభివృద్ధి

● డీసీఓ అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 6: సహకార బ్యాంకులతోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి అన్నారు. శనివారం స్థానిక జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ సహకార దినోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీఓ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సహకార వ్యవస్థలోనే చిన్న సన్నకారు రైతులకు సకాలంలో రుణాలు అందుతున్నాయని, దీంతో ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి మాట్లాడుతూ సహకార రంగాల్లో అనేక మంది విజయగాథల స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్తుండటం శుభపరిణామమన్నారు. సమాజానికి అవసరమైన సేవలు అందించినప్పుడే సహకార వ్యవస్థకు మరింత గుర్తింపువస్తుందన్నారు. ఏడీసీసీ బ్యాంకు ఓఎస్డీ సూర్యనారాయణ, డీజీఎం ఏబీ రాంప్రసాద్, డీసీఈఓ మురళీమోహన్, చీఫ్ మేనేజర్ అనంత పద్మనాభం పాల్గొన్నారు.

సహకార శిక్షణా కేంద్రంలో: 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమంలో డీసీఓ సహకార పతాకాన్ని ఎగురవేశారు. డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్ రాజారెడ్డి, సీఈఓ మురళీమోహన్ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అనంతపురం అర్బన్, జూలై 6: తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను అంగన్‌వాడీలు కోరారు. శనివారం అనంతపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీలు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని, ఐసీడీఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి దాకా నెరవేరలేదన్నారు. జూలై 10వ తేదీన అంగన్‌వాడీల కోర్కెల దినంగా పాటించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. గతంలో తమ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తామన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళాలు


ఎమ్మెల్యేకు విరాళాన్ని అందిస్తున్న పెనుబోలు గ్రామస్థులు

రామగిరి, జూలై 6: అమరావతి నిర్మాణం కోసం రాప్తాడు నియోజకవర్గంలో పెద్దఎత్తున విరాళాలు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పింఛన్‌దారులు రూ.35 వేలు, రెడ్డివారిపల్లి రూ.20,600, కానగులకుంట, కంచికుంట నుంచి రూ.45వేలు, పెనుబోలు గ్రామ పింఛన్‌దారులు రూ.36వేలు మొత్తం 1,36,600 ఎమ్మెల్యే పరిటాలసునీతకు అందజేశారు. వెంకటాపురం, ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి నిర్మాణం కోసం సామాన్యులు కూడా విరాళాలు అందించడం అభినందనీయమన్నారు.

ఘనంగా రుద్ర కళాక్షేత్ర వార్షికోత్సవం


కళాకారులతో రుద్ర కళాక్షేత్రం నిర్వాహకులు

అనంతపురం కల్చరల్, జూలై 6: నగరంలోని రుద్ర కళాక్షేత్రం మొదటి వార్షికోత్సవాన్నిశనివారం సాయంత్రం అనంత కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కళాకారులు రుద్ర కూచిపూడి, రుద్ర కర్ణాటక సంగీతం, రుద్ర యోగ, రుద్రవీణ ప్రదర్శనలిచ్చారు. ప్రదర్శనానంతరం కళాకారులందరికీ జ్ఞాపికలు అందజేశారు. కళాక్షేత్రం నాట్యాచార్యులు సరిత రవీంద్ర, రవికాంత్ రమణ, విజయసాయికుమార్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూలై 6: రామచంద్రనగర్ బాబా మందిరంలో 21వ తేదీన నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకుడు మారుతి శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గైనకాలజీ విభాగానికి మరో రెండు పీజీ సీట్లు

అనంతపురం టౌన్, జూలై 6: బోధనాసుపత్రిలో గైనకాలజీ విభాగానికి అదనంగా రెండు పీజీ సీట్లు మంజూరైనట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శనివారం తెలిపారు. గతంలో 12 పీజీ సీట్లు ఉండగా వసతులు లేవని ఎన్ఎంసీ రెండు సీట్లకు కోత విధించిందన్నారు. ప్రస్తుతం వసతులు ఏర్పాటు చేయడంతో కోల్పోయిన ఆ రెండు సీట్లు మళ్లీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రిన్సిపాల్, ఇతర ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు

బొమ్మనహాళ్, జూలై 6: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. వేకువజామునే ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు సుప్రభాతసేవ చేసి స్వామివారి మూలవిరాట్‌కు ప లు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు అర్చనలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు పొందారు.

మురడిలో ప్రత్యేకపూజలు

డీ.హీరేహాళ్: మండలంలోని మురడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేకపూజలతో పాటు కుంకుమార్చన, బిల్వార్చన, సహస్ర నామార్చన, మహామంగళ హారతి చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు.

ఆలూరుకోనలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి

తాడిపత్రి, జూలై6: మండలంలోని ఆలూరుకోనలో శనివారం శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు చేవారు. అనంతరం ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వైభవంగా పల్లకి సేవ


స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూలై 6: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవవిగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ పట్టణ కమిటీ ఎన్నిక

గుంతకల్లు టౌన్, జూలై 6: పట్టణంలోని ఆవాజ్ కార్యాలయంలో శనివారం ఆవాజ్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నాయకుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా షేక్ షాషావలి, కార్యదర్శిగా షేక్ అబ్దుల్లా, సహాయ కార్యదర్శిగా జాకీర్‌హుసేన్, ఉపాధ్యక్షుడిగా మోదీనాబాద్ మస్తాన్, కోశాధికారిగా ఖాదర్‌తో పాటు 12 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మైనార్టీల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

గుంతకల్లు టౌన్, జూలై 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ కోరారు. ఈ మేరకు స్థానిక కళాశాల వద్ద శనివారం ఆయన నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. వారికి మధ్యాహ్నం భోజనం ప్రారంభించి, పాఠ్యపుస్తకాలను అందజేయాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయికి వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు వెంకటేష్, కిషోర్, సమీర్, జయరాం, చందు, కళ్లాయిస్వామి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి, జూలై 6: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి తెలిపారు. పాతబ్రిడ్జి, కేజీబీవీ పాఠశాల సమీపంతో పాటు కడపరోడ్డు, పప్పూరు రోడ్డు ప్రాంతాల్లో పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. సరైన రికార్డులు లేకపోవడంతో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

యల్లనూరు: మండలంలోని చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. శింగవరం వద్ద నది నుంచి ఇసుకను బుక్కాపురం వైపు తీసుకువెళుతుండగా బీటుకు వెళ్లిన పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసినట్లు కానిస్టేబుళ్లు కృపాకర్‌రెడ్డి, నాగరాజు తెలిపారు.

యాడికి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం రాత్రి యాడికి పోలీసులు సీజ్‌చేశారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని రాయలచెరువు గ్రామం వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా.. నంద్యాల జిల్లాకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. వాటిలో ఒక టిప్పర్, ఒక ట్రాక్టర్ ఉన్నాయన్నారు. వాటిని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి స్వల్పగాయాలు

యల్లనూరు, జూలై6: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన దివాకర్‌నాయుడు శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై స్వల్పంగా గాయపడ్డాడు. వ్యవసాయపొలం వద్ద మోటారు వైర్లు అమరుస్తుండగా వైరు చేయికి తగలడంతో విద్యుత్ షాక్ కొట్టి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు.

ముంపు సమస్యను పరిష్కరించండి

● ఎమ్మెల్యే కాలవకు కౌన్సిలర్ల వినతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, జూలై 6: వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఇళ్లల్లోకి చొచ్చుకెళ్తున్నాయని, ముంపు సమస్యను తక్షణమే పరిష్కరించాలని కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో శనివారం చైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పూలమాలలు, శాలువాలతో ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. తర్వాత పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పట్టణంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదని, మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల సమస్య వెంటాడుతోందని, ట్రాఫిక్ ప్రాంతాల్లో పశువులు సంచరిస్తున్నాయని, దీని కారణంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. కణేకల్లు నుంచి సరఫరా అయ్యే తాగునీటికి విద్యుత్ పరంగా తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తానని, ప్రభుత్వానికి కౌన్సిలర్లు సహకారం అందించి అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. నిధులను తీసుకురావడంపై శక్తినంతా ఉపయోగిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ కిశోర్, కౌన్సిలర్లు ప్రశాంతి, పద్మజ, జ్యోతి, సంజీవ, ఫకృద్ధీన్, అజయ్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలి

● ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ సూచన

తాడిపత్రి, జూలై 6: ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడమే ధ్యేయంగా పని చేయాలని ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. పట్టణంలోని ఆర్‌టీసీ డిపోలో శనివారం డ్రైవర్లు, కండక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. బస్సుల కండీషన్లను డ్రైవర్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు. జిల్లాకు నూతనంగా 25బస్సులు మంజూరు కాగా.. వాటిలో 10బస్సులను తాడిపత్రి డిపోకే కేటాయించామన్నారు. త్వరలో మరో 90బస్సులు రానున్నాయని చెప్పారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఇప్పటికి 90మందిని తీసుకున్నామన్నారు. ఈనెల 10న సైకిల్‌స్టాండ్‌కు సంబంధించి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ జిల్లావ్యాప్తంగా 1.32లక్షల మందిని వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నామన్నారు. సంస్థ ఆదాయాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఉద్యోగి కృషిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శంకర్, ఇన్‌స్పెక్టర్ నందిని, అధికారులు పల్లయ్య, డీఎం వలి తదితరులు ఉన్నారు.

రాయదుర్గంలో చోరీ

రాయదుర్గం, జూలై 6: పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు నాగభూషణం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన మరో ఇంట్లో కుటుంబంతో పాటు నిద్రపోయామని, కాగా మధ్యరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి బీరువా తాళాన్ని కూడా పగులకొట్టారని, అందులో రూ. 77 వేల నగదుతో పాటు బంగారు కమ్మలు, వెండి వస్తువులు చోరీ చేశారని వాపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

లారీ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి,జూలై6: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు సిమెంట్ లారీ బోల్తా పడి డ్రైవర్ బాలకృష్ణ స్వల్పంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి నుంచి బళ్లారికి వెళ్తున్న సిమెంట్ లోడు లారీ చెరువుకట్ట సమీపంలో రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పెద్దవడూగురు మండలం ఏ తిమ్మాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ బాలకృష్ణ స్వల్పంగా గాయపడ్డాడు.. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు

బెళుగుప్ప, జూలై 6 : ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పశువైద్య కేంద్రాల్లో శనివారం కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేసినట్లు రేబిస్ పశువైద్యాధికారి రమేష్ బాబు తెలిపారు. రేబిస్ ప్రాణాంతకమని, కుక్కల పెంపకందారులు వాటితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దాదాపు 66 కుక్కలకు టీకాలు వేశామని చెప్పారు.

డిగ్రీ ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం

రాయదుర్గం రూరల్, జూలై 6: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీ చేరుటకు ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. కళాశాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొదటిదశ షెడ్యూల్‌లో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 10వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ఇచ్చామన్నారు. 19న సీట్ల కేటాయింపు నిర్వహిస్తామన్నారు. డిగ్రీ కళాశాలలో 19 కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఉచితంగా ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ మహేశ్వర రెడ్డి

గుంతకల్లు టౌన్, జూలై 6: మండలంలోని నల్లదాసరిపల్లికి చెందిన ఆవుల లక్ష్మన్న(50) హత్య కేసులో ముగ్గురు నిందితులను రూ రల్ పోలీసులు అరె స్టు చేశారు. పట్టణంలోని రూరల్ పో లీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ సురేష్‌తో కలిసి సీఐ మహేశ్వరరెడ్డి అరెస్టు వివరాలను వెల్లడించారు. నల్లదాసరిపల్లి గ్రామానికి చెందిన ఆవుల లక్ష్మన్న కృష్ణవేణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి 2021లో వివాహం చేశారు. కాగా ఆరు నెలల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆమె కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్యను కాపురానికి పంపాలని చంద్రశేఖర్ పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టాడు. ఆ సమయంలో మామ లక్ష్మన్న అల్లుడు చంద్రశేఖర్‌ను చెప్పుతో కొట్టి అవమానించాడు. మిమ్మల్ని చంపి మీ ఆస్తిని తన కూతురుకు చెందేలా చేస్తానని బెదిరించాడు. లక్ష్మన్న రౌడీషీటర్ కాబట్టి తమను ఎక్కడ చంపుతాడోనని చంద్రశేఖర్, అతడి సోదరుడు రాజశేఖర్ భయపడ్డారు. లక్ష్మన్నను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా వారు తమ స్నేహితుడు సతీష్ సహాయం తీసుకుని లక్ష్మన్న హత్యకు పథకం రచించారు. ఈ క్రమంలో లక్ష్మన్న గురువారం పని మీద బైక్‌పై గుంతకల్లుకు వచ్చాడు. పని ముగించుకుని సాయంత్రం 6:30గంటల సమయంలో స్వగ్రామం నల్లదాసరిపల్లికి బయలుదేరాడు. మార్గంమధ్యలో తిమ్మాపురం సమీపంలోని నక్కాఓబులేసు పొలం వద్దకు రాగానే అక్కడ మాటు వేసిన చంద్రశేఖర్, రాజశేఖర్, సతీష్ ఒక్కసారిగా కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి పారిపోయారు. నక్కనదొడ్డి రైల్వే స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి వద్ద ముగ్గురు నిందితులను శనివారం అదుపులోని తీసుకున్నామని, వారి వద్ద నుంచి రెండు కత్తులు , రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

గుంతకల్లుటౌన్, జూలై6: పట్టణంలోని ఇల్లూరు గోపాలకృష్ణ భవనంలో శనివారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951, అక్టోబరు21న భారతీయ జనసంఘ్‌ను స్థాపించి మొదటి అధ్యక్షుడయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, జిల్లా కార్యవర్గసభ్యులు సంజీవరెడ్డి, చెన్నా రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల గుర్తింపునకు కాలనీల్లో పర్యటన

పామిడి, జూలై 6 : పట్టణంలో ప్రజా సమస్యలను గుర్తించడానికి టీడీపీ శ్రేణులు పలు కాలనీల్లో శనివారం పర్యటించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ చేపట్టిన శుభోదయం కార్యక్రమంలో భాగంగా వారు ఈ పర్యటన చేపట్టారు. నెహ్రూనగర్, బాలాజీనగర్‌లలో వీధివీధి తిరిగి పలు సమస్యలను గుర్తించారు. వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

కూడేరు, జూలై 6: ఆవుకు ఆపరేషన్ చేస్తానని డబ్బు తీసుకొని ఆపరేషన్ చేసి కుట్లు వేయకుండా ఆ ఆవును చంపిన పశువైద్యాధికారి వినోద్‌కుమార్ పై చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని చోళసముద్రం గ్రామంలోని పశువైద్యశాల ఎదుట కొర్రకోడు గ్రామానికి చెందిన రైతు రామ్మోహన్ తన కుటుంబ సభ్యులతో పాటు పలువురు రైతులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టారు. పశువైద్యశాల గేటుకు తాళాలు వేసి రోడ్డుపై బైఠాయించారు. తర్వాత మాట్లాడుతూ సుమారు ఐదేళ్ల క్రితం గర్భంతో ఉన్న ఆవు ఈనడానికి ఇబ్బందులు పడుతుంటే చోళసముద్రంలోని అప్పటి పశువైద్యుడు వినోద్‌కుమార్‌కు సమాచారం అందించామని, దీంతో ఆయన ఆపరేషన్ చేసి దూడను తీసివేయాలని చెప్పారని, ఇందుకు రూ. 30వేలు డబ్బులు తీసుకున్నారని, తర్వాత ఆపరేషన్ చేసి కుట్లు వేయడానికి దారం లేకపోవడంతో అలాగే వదిలేశారని, దీంతో ఆవు చనిపోయిందని తెలిపారు. 80 వేలు విలువ జేసే ఆవు మృతి చెందడంతో న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరామన్నారు. న్యాయం జరుగుతుందని ఇన్నాళ్లు వేచి చూశామన్నారు. కానీ ఏళ్లు గడిచినా ఎవరూ పట్టించుకోలేదని, దీంతో ఇప్పుడు ఆందోళనకు దిగామని తెలిపారు. ఆవు మృతి కారణమైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్రమణ్యం, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాలుసు ఏడీ ఏహెచ్ రత్నకుమార్ తదితరులు రైతులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉరవకొండలో పోలీసుల అత్యుత్సాహం

ఉరవకొండ, జూలై 6: పట్టణంలోని వైసీపీ కార్యాలయానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి వస్తున్నారన్న సమాచారంతో భారీగా పోలీసులు మొహరించారు. ఉదయం నుంచే ప్రధానకూడలిలో హడావుడి చేశారు. సుమారు 200మందితో బందోబస్త్ ఏర్పాటు చేశారు. వైసీపీ కార్యాలయానికి వెళ్లే రహదారిపై వాహనచోదకులను అడ్డుకున్నారు. మీడియా ప్రతినిధులను సైతం గుర్తింపు కార్డులుంటేనే అటువైపు అనుమతిస్తామన్నారు. దీంతో పోలీసులు, మీడియా ప్రతినిధులు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల అత్యుత్సాహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉరవకొండ ప్రశాంతంగా ఉన్నా, పోలీసులు వ్యవహరించిన తీరుపైన సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గరుగుచింతలపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

పుట్లూరు, జూలై6: మండలంలోని గరుగుచింతలపల్లిలో శనివారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. ఒక వర్గానికి చెందిన నవీన్, మరొక వర్గానికి చెందిన రవి, నాగరాజుకు గాయాలయ్యాయి. పాతకక్షల నేపథ్యంలో నవీన్‌ను రవి, నాగరాజు ద్విచక్రవాహనంతో ఢీ కొట్టారు. దీంతో నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా ద్విచక్రవాహనం కిందకు దిగి మరోసారి ఇరువురు కొట్టుకున్నారు. గ్రామంలోని స్థానికులు ఇరువురిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అతిసార కేసులు ప్రబలకుండా చూడండి: డీఎంహెచ్‌వో

ఉరవకొండ,జూలై6: గ్రామాల్లో అతిసార కేసులు ప్రబలకుండా వైద్యసిబ్బంది తగు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి సూచించారు. పట్టణంలోని సీహెచ్‌సీని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అతిసార కేసుల వివరాలను వైద్యులనడిగి తెలుసుకున్నారు. రెండ్రోజుల నుంచి 20కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. డయేరియా వల్ల మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అతిసార బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఎంఓ త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రహ్మణ్యం, వైద్యులు గంగాధర్, అర్జున్ పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

బెళుగుప్ప, జూలై 6 : మండలంలోని నక్కలపల్లికి చెందిన రైతు వడ్డే తిప్పేస్వామి (45) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిప్పేస్వామి రెండు ఎకరాల తోటలో బోర్లు వేయించడానికి, పంటల సాగుకు అప్పులు చేశాడని, వడ్డీతో కలిపి అప్పులు భారమవడంతో ఆందోళనతో గుండెపోటు గురై చనిపోయాడని చెప్పారు. ఆయనకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. అంత్యక్రియలకు గ్రామానికి చెందిన ముత్యాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

విడపనకల్లు, జూలై 6: మండలకేంద్రంలోని కిరాణా దుకాణాల్లో శనివారం తూనికలు, కొలతల అధికారులు శంకర్, సురేష్ తనిఖీలు చేశారు. ఓ కిరాణా షాపులో ఆయిల్‌ను తూకం వేయగా.. కిలో ఉండాల్సిన చోట కేవలం 780 గ్రాములు ఉండటంతో కేసు నమోదు చేశారు. తప్పుడు తూకాలతో ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు వచ్చారని తెలుసుకున్న వ్యాపారులు చాలామంది దుకాణాలు మూసివేశారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం (శెట్టూరు), జూలై 6: నిరుపేద విద్యార్థి వైద్యఖర్చులకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ ఆర్థిక సాయం చేశారు. శెట్టూరు మండలం మాకొడికి గ్రామానికి చెందిన హరిజన శంకరప్ప, నీలమ్మ దంపతుల కుమారుడు ఆదిత్య 4వ తరగతి చదువుతున్నాడు. నెలరోజుల క్రితం ఆ బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో వెన్నెముక, కుడి కాలు దెబ్బతిని నడవలేని స్థితిలోకి వెళ్లాడు. కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో చూపించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్లమని డాక్టర్లు సూచించారు. వైద్యఖర్చులు వారే భరిస్తారని తెలిపారు. అయితే బెంగళూరుకు వెళ్లడానికి కూడా చిల్లిగవ్వ లేక కృతోచని స్థితిలో ఉండగా ఆ గ్రామ యువకులు గమనించి విషయాన్ని స్థానిక ఉపాధ్యాయుడు, ఇన్ఫినిటీ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్‌కు చెప్పారు. స్పందించిన ఆయన తక్షణమే రూ. 15 వేలు నగదును ప్రయాణ ఖర్చులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పర్యటన


ప్రజలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూలై6: ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం జేసీ అస్మిత్‌రెడ్డి మొదటిసారిగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. సీబీరోడ్డు, పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో చిరువ్యాపారుల నుంచి దుకాణాదారుల వరకు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారాలు ఎలా ఉన్నాయని ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో ఉన్న టీ కొట్టులో ప్రజలతో కలిసి టీ తాగారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు యుగంధర్, రమేష్, రంగనాయకులు, శివ, సుదర్శన్, హేమంత్, యువరాజు తదితరులు ఉన్నారు.

సీఎం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారు


గుమ్మనూరు జయరాంతో టీడీపీ నాయకులు

యాడికి, జూలై6: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. మండలంలోని రాయలచెరువు మీదుగా శనివారం తిరుమలకు వెళుతున్న స్థానిక టీడీపీ నాయకులు కలిశారు. పార్టీ కార్యాలయంలోకి ఆహ్వానించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 164సీట్లు గెలుపొందడం చారిత్రాత్మక విజయమన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేరుస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్, నాయకులు అమిలినేని సత్య, బాబుగౌడ్, మదమంచి శివ, ఆదినారాయణ, రామనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఉరవకొండ, జూలై 6: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతిని పట్టణంలో శనివారం ఎమ్మార్పీఎస్, డీజీహెచ్ఎస్ఎస్ నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నప్ప, సురేష్, వెంకటేశులు, గంగాధర్, డీజీహెచ్ఎస్ఎస్ నాయకులు గోపాల్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాబూ జగజ్జీవన్ రామ్ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొక్కు చెల్లించిన టీడీపీ శ్రేణులు

కళ్యాణదుర్గం, జూలై 6 : ఎమ్మెల్యేగా అమిలినేని సురేంద్రబాబు అత్యధిక మెజార్టీతో గెలవడంతో మండలంలోని బోరంపల్లి గ్రామ టీడీపీ శ్రేణు లు మొక్కు తీర్చుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయం వెలుపల 216 టెంకాయలు కొట్టారు. భక్తుల కు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సురేంద్ర బాబు సోదరుడు అమిలినేని ఎర్రిస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు రామ్మోహన్, గొల్ల మాజీ సర్పంచ్ రామ్మోహన్, మారెప్ప, మల్లికార్జున, రంగారెడ్డి, వెంకటేశులు, మల్లయ్య, గోపాల్, ఆదినారాయణరెడ్డి, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల పింఛన్ తొలగించాలి

బొమ్మనహాళ్, జూలై 6: మండలంలో అనర్హులకు గత వైసీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందని దర్గాహొన్నూరు మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కేశప్ప ఆరోపించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. దర్గాహొన్నూరు గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వం అర్హత లేకున్నా ఆ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అధికారాన్ని అడ్డం పెట్టుకుని పింఛన్ మంజూరు చేసిందని తెలిపారు. అనర్హులకు పింఛన్ ఇవ్వడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వం అనర్హుల పింఛన్లు తొలగించాలని కోరారు.